# పౌరులకు సైబర్ నేరాలపై అవగాహన




ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం ఫిబ్రవరి 20 చట్టం ప్రతినిధి నూజివీడు సీఐ రామకృష్ణ గారి ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు ఆగిరిపల్లి ఎస్సై శుభశేఖర్ సిబ్బందితో ఆగిరిపల్లి బస్టాండ్ నందు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం చేశారు, ఫోన్లో వచ్చే ఓటీపీలు వివరాలు ఇతరులకు తెలియజేయకూడదని, మరియు వాట్సాప్ లో తెలియని వారు ద్వారా వచ్చే డౌన్లోడ్లు చేయకూడదని, కొన్ని సందర్భాలలో బ్యాంకు వివరాలు తెలపమని చేసే ఫోన్ కాల్స్ ను నమ్మి వారికి ఓటీపీలు చెప్పవద్దని, పొరపాటున సొమ్మును ఫోను ద్వారా బయటి వ్యక్తికి వెళితే సైబర్ క్రైమ్ నెంబర్ 1930కి డయల్ చేసి వివరాలు చెప్పాలని, ఏటీఎం మిషన్లలో డబ్బులు తీసేటప్పుడు పొరుగు వారిని గమనించాలని తెలియజేశారు.ఏలూరు జిల్లా ఎస్పీ శ్రీ కె ప్రతాప్ శివ కిషోర్ ఐపీఎస్ వారు నూజివీడు డిఎస్పీ శ్రీ కె వి వి ఎన్ వి ప్రసాద్ వారి యొక్క ఆదేశాలపై సైబర్ నేరాలు, పోక్సో యాక్ట్, మాదకద్రవ్యాల వాడకం వలన కలుగు దుష్పరిణామ లపై నూజివీడు రూరల్ సిఐ కె రామకృష్ణ గారు ఆగిరిపల్లి ఎస్ఐ శుభ శేఖర్ గారు ప్రజలకు రాబాజూ ఖష్ సోషల్ మీడియా ఫ్రాడ్ లు క్రైమ్ ఎగైనెస్ట్ ఉమెన్, డయల్ 112 పై అవగాహనా కార్యక్రమాలు ఈ రోజు అనగా 20.02.2026 వ తేది నాడు ఆగిరిపల్లి బస్ స్టాండ్ వద్ద నిర్వ హించినారు.

ఈ కార్యక్రమంలో నూజివీడు రూరల్ ఇన్స్పెక్టర్ కె రామకృష్ణ గారు ఆగిరిపల్లి ఎస్ఐ శుభ శేఖర్ గారు ప్రజలతో మాట్లాడుతూ సైబర్ నేరాలు, మహిళల మరియు మైనర్ బాలికల చట్టాలను గురించి, మాదక ద్రవ్యాలను వినియోగించిన, కలిగి వున్న విక్రయించిన, రవాణా చేసిన చట్టపరమైన కఠిన చర్యలు తీసు కుంటాము అని, ఫేస్బుక్, ట్విట్టర్ వంటి సోషల్ నెట్వర్క్ ను, జీ మెయిల్ను అవసరం మేరకు వాడాలని, ఫొటోలు, వ్యక్తిగత సమాచారం పోస్ట్ చేయవద్దని పోలీసులు సూచిస్తున్నారు. ఇంటర్నెట్ సమాచార సేకరణకు మాత్రమే ఉపయోగించుకోవాలని సూచిస్తున్నారు. సోషల్ మీడియా మధ్యమ లలో అపరిచిత వ్యక్తులతో పరిచయాలు పెంచుకోకూడదని సోషల్ మీడియా మాధ్యమాలలో వచ్చి లింకులను గాని మెసేజ్ లను గాని యాప్ ను గాని తెలియని వారు పంపించినటు వంటివి ఓపెన్ చేస్తే మీ యొక్క గోప్యమైనటు వంటి సమాచారం తస్కరిస్తారని బ్యాంక్ అధికారులు ఇవన్నీ లేదా ఇతర అధికారు లు మని చెప్పి మీ యొక్క ఓ.టీ.పీ ని అడిగిన ఎడల మీరు అధికారులు యొక్క వివరాలను తెలుసు కున్న తర్వాత మాత్రమే తెలియచేయాలని లేకపోతే ఓటీపీ చెప్పిన వెంటనే మీ బ్యాంకు లోను ఉన్న అమౌంట్ లు సైబర్ నేరగాళ్ల దొంగిలిస్తారని,మీరు అవగాహన నడిపించు కుని మీ కుటుంబ సభ్యులకు కూడా అవగాహనను కల్పించాలని పోలీస్ అధికారులు ప్రజలకు తెలియ తెలియజేశారు. మీ చుట్టూ ప్రక్కల జరిగే అన్యాయల ను గురించి లేదా అసాంఘిక కార్యక లాపాలను గురించి దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ కు గాని లేదా డయల్ 112 తెలియ చేసిన యెడల సమాచారం అందించిన వారి యొక్క వివరాలను గోప్యముగా ఉంచుతామని నూజివీడు రూరల్ ఇన్స్పెక్టర్ కె రామకృష్ణ ఆగిరిపల్లి ఎస్ఐ శుభ శేఖర్ గారు లు తెలియ చేసినారు.

# సీఎస్ఐఆర్ ఐఐసిటి ప్రాంగణంలో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా...

**ముఖ్య అతిథిగా పాల్గొన్న పద్మశ్రీ అవార్డు కేతావ సోమలాల్ నాయక్...**




**ఉప్పల్,20 ఫిబ్రవరి (చట్టం) :** హైదరాబాద్ హబ్సిగూడలోని ప్రముఖ శాస్త్రీయ పరిశోధనా సంస్థ ఇండియన్ ఇన్స్టిట్యూట్ అఫ్ కెమికల్ టెక్నాలజీ ప్రాంగణంలో శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు ఆధ్యాత్మిక భక్తి, సామాజిక చైతన్యంతో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి పద్మశ్రీ పురస్కార గ్రహీత కేతావత్ సోమలాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శాస్త్రవేత్తలు, పరిశోధకులు, విద్యార్థులు సంయుక్తంగా పాల్గొని "భోగ్ బండారు" కార్యక్రమాన్ని భక్తి భావంతో నిర్వహించారు. కార్యక్రమానికి డాక్టర్ పావని వడతీయ భాయ్ అధ్యక్షత వహించగా, సంస్థ డైరెక్టర్ శ్రీనివాస రెడ్డి, హెచ్.ఓ.డి. ఏ.జి.రావు, డాక్టర్ సుగాలి చంద్రశేఖర్ మరియు లింగ గారు ముఖ్య వక్తలుగా పాల్గొన్నారు. వక్తలు తమ ప్రసంగాల్లో సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలోచనలు సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. యువత శాస్త్ర విజ్ఞానంతో పాటు సాంస్కృతిక విలువలను కూడా అలవరుచుకోవాలని సూచించారు. శాస్త్రం మరియు సంస్కృతి కలిసినపుడే సమాజం సమగ్ర అభివృద్ధి సాధిస్తుందని వారు తెలిపారు.

ఈ సందర్భంగా పద్మశ్రీ అవార్డు గ్రహీత కేతావత్ సోమ్లాల్ గారు భావోద్వేగభరిత ప్రసంగం చేశారు. విద్యార్థులు, శాస్త్రవేత్తలను ఉద్దేశించి మాట్లాడుతూ దేశానికి ఎదురయ్యే సవాళ్లను సమిష్టి కృషితోనే ఎదుర్కొనగలమని చెప్పారు. ఎదురు నీటిలో చేప ఎలా ఎదుగుతుందో, అలా మనం కూడా "ఎదురు ఈత" స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం ఆధ్యాత్మికత, సామాజిక బాధ్యత మరియు శాస్త్రీయ దృక్పథం కలయికగా నిలిచి, పాల్గొన్న వారిలో ప్రేరణ నింపింది.

# ప్రతి వర్గానికి సమానహక్కులు, అవకాశాలు మరియు న్యాయం అందించాలి

**- ఆడెపు వేణు, లోక్ అదాలత్ సభ్యులు ;**




**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఫిబ్రవరి 20,( చట్టం బ్యూరో ) :** సమాజంలోని ప్రతి వర్గానికి సమాన హక్కులు, అవకాశాలు మరియు న్యాయం అందించాల్సిన అవసరం ఉందని లోక్ అదాలత్ సభ్యులు, న్యాయవాది శ్రీ.ఆడెపు వేణు అన్నారు. జిల్లా న్యాయ సేవాధికర సంస్థ ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికర సంస్థ అధ్యక్షురాలు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి పి.నీరజ గారి ఆదేశాలతో సీనియర్ సివిల్ జడ్జి/కార్యదర్శి, ఋూూ శ్రీ. పి.లక్ష్మణాచారి సమన్వయంతో శుక్రవారం తంగళ్లపల్లి మండలంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీ (మహిళ), సిరిసిల్లలో రాజనీతి శాస్త్ర విభాగం సహకారంతో ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం ను పురస్కరించుకొని న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 20న ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవంను జరుపుకుంటామని, సమానత్వం, సమగ్ర అభివృద్ధి, మానవ హక్కుల పరిరక్షణ మరియు సామాజిక న్యాయం సాధన లక్ష్యంగా ఈ దినోత్సవాన్ని ఆచరిస్తున్నామని తెలిపారు. పేదలు, మహిళలు, పిల్లలు, దివ్యాంగులు మరియు వెనుకబడిన వర్గాలకు న్యాయ సహాయం, విద్య, ఉపాధి అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం అనేది కేవలం చట్టపరమైన హక్కుల పరిమితిలో కాకుండా, ఆర్థిక, సామాజిక మరియు రాజకీయ రంగాలలో సమాన అవకాశాలు కల్పించడంలో కూడా ప్రతిఫలించాలని అన్నారు. ఈ సదస్సులో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీమతి.ఈ.జ్యోతి, న్యాయవాదులు గుర్రం ఆంజనేయులు, కడగండ్ల తిరుపతి, అరుణ, రాజనీతి శాస్త్ర విభాగ అధ్యాపకురాలు శ్రీమతి.నవ్యశ్రీ మరియు విద్యార్థినిలు పాల్గొన్నారు.

# ఆర్థిక పునరావస సహాయానికి దివ్యాంగులకు ఇంటర్వ్యూలు

**ఐడీఓసీలో నిర్వహించిన ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఫిబ్రవరి 20 ,(చట్టం బ్యూరో) :** ఆర్థిక పునరావాస సహాయ పథకానికి సంబంధించి జిల్లాలోని ఆయా మండలాల నుంచి దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. దివ్యాంగుల ఆర్థిక సహాయ పునరావాస పథకం కింద జిల్లాకు 14 యూనిట్లు మంజూరు కాగా ఒక్కో యూనిట్ విలువ రూపాయలు 50,000 వేలు. 100% రాయితీ ఉంటుంది. జిల్లాలోని ఆయా మండలాలకు చెందిన 38 మంది దరఖాస్తు చేసుకున్నారు.

ఈ సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం(ఐడీఓసీ)లో శుక్రవారం దివ్యాంగులకు ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. 37 మంది దివ్యాంగులు హాజరుకాగా, వారికి సంబంధించిన సర్టిఫికెట్లు, అర్హతలు పరిశీలించి వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంటర్వ్యూలో డీఆర్డీఓ గీత, డీడబ్ల్యూఓ లక్ష్మీరాజం, ఎస్సీ కార్పొరేషన్ అధికారి స్వప్న, ఏవో మెప్మా మీర్జా ఫసహత్ అలీ బేగ్ ఉన్నారు.

---------



## ఇందిరమ్మ ఇండ్లు పేదలకు గొప్ప వరం.

**మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్.**





**పెగడపల్లి ఫిబ్రవరి 20 ( చట్టం న్యూస్):** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల పరిధిలోని నంచల గ్రామంలో చేని రమణ,కు మంజూరైన ఇందిరమ్మ ఇల్లును స్థానిక సర్పంచ్ కుంటాల వనజ–శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ తో కలిసి భూమి పూజ ప్రారంభించారు అనంతరం మాట్లాడుతూ రేవంత్ రెడ్డి గారి ప్రజా పాలన ప్రభుత్వం ద్వారా తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ వికలాంగుల ట్రాంజెండర్ సంక్షేమ శాఖ మంత్రివర్యులు లక్ష్మణ్ కుమార్ గారి సహకారంతో చేని రమణ కు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు, నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు వరం లాంటిదని అన్నారు రాబోవు మూడు సంవత్సరాల కాలంలో అర్హులను గుర్తించి మిగతా వారందరికీ తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రివర్యులు లక్ష్మణ్ కుమార్,గారి సహకారంతో అందరికీ ఇండ్లు మంజూరు చేపిస్తామని ఇంతకుముందు మంజూరైన లబ్ధిదారులందరూ త్వరలో ఇండ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎడ్ల శ్యామ్ సుందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నవీన్ కుమార్ ,పార్టీ వార్డు సభ్యులు సాయిల, రాకేష్,అక్కం గంగాధర్, కాంగ్రెస్ నాయకులు ఉప్పుల రవీందర్,సూర అంజి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## అభిమానం చాటుకున్న వికలాంగుడు ఓదెల నరేష్

**రాపర్తి ప్రతిమ-వేంకటేష్ పెళ్లిరోజు సందర్భంగా అన్నదానం చేసిన ఓదెల నరేష్**



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఫిబ్రవరి 20 ,(చట్టం బ్యూరో)** కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్శకుర్తి గ్రామానికి చెందిన వికలాంగుడు ఓదెల నరేష్ అక్క ప్రతిమ బావ వెంకటేష్ పెళ్లిరోజు సందర్భంగా అర్చన ఛేహించి పూజలు నిర్వహించి తదనంతరం వేములవాడ రాజన్న మెట్లపైన అన్నదానం ఏర్పాటు చేశారు. నాకు స్వంత అక్క బావ లెక్క అందరూ నాకు వారు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో కలిగి ఉండాలని వేములవాడ రాజన్న ను మనస్ఫూర్తిగా నరేష్ కోరుకున్నాడు

## ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, కరీంనగర్‌లో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్మెంట్ పై అవగాహన కార్యక్రమం ;



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఫిబ్రవరి 20,( చట్టం బ్యూరో) :** ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (అటానమస్), కరీంనగర్‌లో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్మెంట్ సెల్ (జుఐజ) ఆధ్వర్యంలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ స్ఫూర్తి స్ఫూర్తిని పెంపొందించడం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ అధ్యక్షత వహించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ మాట్లాడుతూ, ప్రస్తుత డిజిటల్ యుగంలో విద్యార్థులు ఉద్యోగ అవకాశాలకే పరిమితం కాకుండా స్వయం ఉపాధి దిశగా ఆలోచించాలని సూచించారు. వ్యాపార ఆలోచనలను అభివృద్ధి చేసుకొని స్టార్టప్‌లను ప్రారంభించడం ద్వారా ఆర్థికంగా స్వావలంబన సాధించవచ్చని వైస్ ప్రిన్సిపల్ కే రాజయ్య, టీజీ జిసిజిటిఏ జనరల్ సెక్రెటరీ డా.కె సురేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్మెంట్ సెల్ (జుఐజ సెల్) కన్వీనర్ డాక్టర్ బూర్ల నరేష్ కార్యక్రమ లక్ష్యాలను వివరించి, విద్యార్థుల్లో ఎంట్రప్రెన్యూర్ నైపుణ్యాలు పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వ పథకాలు, స్టార్టప్ అవకాశాలు మరియు నూతన ఆవిష్కరణలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్మెంట్ సెల్ సభ్యులు , అధ్యాపకులు డాక్టర్ మల్లారెడ్డి ,డాక్టర్ కే రామకృష్ణ, డాక్టర్ ఎం శ్రీనివాస్ రెడ్డి , డా.హర్ జోత్ కౌర్ ,డాక్టర్ కే. అర్జున్, కే .సుధాకర్, పి శ్రీనివాస్, బి.నర్మదా, రాములు ,నాగరాజు, మల్లేశం, శిరీష, పూర్ణచందర్ మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చట్టం సాహితీ లోకం 95814 19999



### పల్లెకు పట్టణానికి ఎంత వ్యత్యాసం

పల్లెలు ప్రశాంతతకు నిలయాలు
సంస్కృతి సాంప్రదాయాలకు పట్టు గొమ్మలు
స్వచ్ఛమైన నీటితో పారుతున్న సెలయేళ్లు, నదీ జలాలు
పచ్చని చెట్లు ప్రగతికి సోపానాలు
దాగున్నాయి ఎన్నో ఆరోగ్య రహస్యాలు
ప్రాణవాయువును గుండెల నిండా
పీల్చుకునే అవకాశాలు
అలసిన మనసులకు ఉపశమనం కలిగించే హరిత శోభలు
ప్రతిఫలం ఆశించకుండానే మనకు చేకూర్చేను ఎన్నో ప్రయోజనాలు
క్రిమి కీటకాదులతో, జంతు జాలాలతో కలిగే పరిచయాలు
వాటి నుండి నేర్చుకుని ఎన్నో ప్రాపంచిక విషయాలు
పైసా ఖర్చు లేకుండా నేర్చుకునే ఎన్నో విజ్ఞాన సంబంధితాలు
పట్టణాలు ఎండమావులను తలపించెడి ఆకర్షణలు
గుప్పెడు మూసి ఉన్న చందంగా వీటి మనోవికారాలు
విష సర్పాల్లా పడగలెత్తే కాలుష్య కారకాలు
ప్రాణవాయువు లేక పెరిగిపోతున్న అనారోగ్యాలు
చెరువులన్నీ పారిశ్రామిక వ్యర్థాలకు నిలయాలు
వాహనాల,ఇళ్ళ కట్టడాల రణగొణ ధ్వనుల మధ్య నిద్రలేని ఎన్నో జీవితాలు
కట్టడాల మధ్య ఆస్వాదించలేని వెన్నెల రాత్రులు
అలజడుల మధ్యనే ఆరిపోతున్న దీపాలు
ముఖానికి రక్షణ కవచం లేనిదే స్వేచ్ఛగా తిరగలేని మనుషులు
కృత్రిమాలతో కాపురం చేస్తున్న నవీన యుగపు మానవులు
నల్లేరు మీద నడకలా సాగుతున్న
కార్పొరేట్ వైద్యాలు
అభివృద్ధి అంటూ అన్నింటిని పడగొడుతూ ఉంటే చెప్పుకోవటానికి ఉండవు తీపి గుర్తులు

పేరు:- రవీంద్రబాబు అరవా
ఊరు:- హైదరాబాద్



## చట్టం సాహితీ లోకం 95814 19999

### రేపటి కోసం



రేపు రెండు అక్షరాల పదం .
రేపు అనేది అనిశ్చితం అయినా సరే రేపు రేపే.
రేపు అన్నది లేకపోతే చైతన్యం ఉండదు నేటికి.
నిన్న గడిచిపోయింది. నేడు గడిచిపోతుంది రేపటి కోసం.
రేపటి కోసం ఆశగా ఎదురు చూస్తూ నిన్నటి గాయాలు మానుతాయని.
నిన్నటి ఇబ్బందులు , సమస్యలు రేపు ఉంటాయని అనుకోవలదు.
ఈరోజు అనుభవించే బాధల కొలిమి, రేపు సంతోషపు సంబరాలుగా మారవచ్చు.
ఈరోజు సూక్ష్మక్రిమి నిన్నటి అండము మాత్రమే. పరిణామ క్రమం అభివృద్ధి.
బీటలు వారిన భూమి తల్లి కూడా
రేపటి వాన చినుకుల కోసం ఎదురుచూస్తుంది.
నేడు ఏ తరం వారు కష్టపడ్డా రేపటి తరం కోసమే. వారి సుఃఖం కోసమే.
నేడు నాటిన విత్తు మొలకెత్తక మానదు, పెరుగుతుంది పెను వృక్షంగా.
నిన్న కన్నా నేడు బాగుంటుంది. ఎప్పుడు కూడా. కాలరీతి నీతి అంతే.
నేటి కన్నా రేపు మరింత సుందరంగా ముస్తాబు అవుతుంది.
రేపు అనేది లేకపోతే ఏ మనిషికి సానుకూల స్పందన ఉండదు తగినంత.
రేపు విసిరే సవాళ్ల కోసం , కావాల్సిన శక్తి పుంజుకుంటారు నేడు.
రేపటి జీవితం సుఖంగా నడవాలని, నేడు చేస్తూ ఉంటారు సంపాదన.
ఒకనాటి ఆదిమానవుడు వెనకబడ్డ జీవితం నుండి నేడు
ఆధునిక సాంకేతిక సౌకర్యాలు సాధించుకోవడానికి కారణం రేపటి పై ఆశ.
నేడు కనిపెట్టిన ఏ ఆవిష్కరణ అయినా నిన్నటి అవసరం ప్రాతిపదికన మాత్రమే.
మనిషికి ఆశతో పాటు, శరీరాన శ్వాస కూడా నిలిపేది రేపటి కోసం.
రేపు అన్నది లేకపోతే, రేపటిపై నమ్మకం కరువైతే ఈరోజుకు లేదు అర్థం.
కేవలం శ్వాస మాత్రమే కాదు, రేపటి పై ఆశ కూడా బతికిస్తుంది మనిషిని.

రచన: ముక్కా సత్యనారాయణ
పెనుగంచిప్రోలు, ఎన్టీఆర్ జిల్లా

## చట్టం సాహితీ లోకం 95814 19999

### అమ్మతనాన్ని పంచిన గుడిబండ కాంతామణులందరికి



వేగుచుక్క ఉదయించక మునుపే
తొలి పొద్దు పొడవక మునుపే
ఏ పాపం తెలియని పాప
ఇలలో ఉదయించెను

నవమాసాలు మోసిన
ఓ నరరూప రాక్షసి
ఓ నవ జాత శిశువును
ముళ్ళ పొదల్లో విడిచె

ఆనందాల కోసం అర్రులు చాసినపుడు
నవమాసాలు మోసినప్పుడు
పురిటి నొప్పుల పడినపుడు
తెలియలేదా....?ఇది తప్పు అని..

ఈ పా (ప) పం ...ఎవరిది...?
పుట్టి పుట్టగానే అనాథైన శిశువుదా..?
అభం శుభం తెలియని పాపదా..?
పురిటి పాపను పారేసిన పాపాత్ములాలుదా..?
ఆరేడు గంటలు గుక్కెడు పాలకోసం
ఉగ్గు పట్టి ఊపిరి బిగబట్టి
కన్ను తెరవని పసికందు
ఇటుక బట్టీ పక్కన కాలం గడిపెను

వెచ్చని పొత్తిళ్ళలో వుండాల్సిన "పుత్తడిబొమ్మ"
పుడమి పై "వరాహా" లతో కాలక్షేపం చేసెను

"కుక్క"లకు ఆహారం కావాల్సిన "కల్పవల్లి" ని
అమ్మ కాని "అమ్మ" లు అక్కున చేర్చుకొని

పాలు బట్టి చేరదీసి ,చేయూత నందించి
మాతాశిశు కేంద్రం లో అప్పజెప్పి
మమతానురాగాలు పంచిన మగువలు
అమ్మతనాన్ని పంచిన ఇంతులు

గుడిబండ కాంతామణులందరికి
అంగన్వాడీ టీచర్లకు, ఆశా వర్కర్ల కు
శిశువును అక్కున చేర్చుకొన్న నారీ మణులందరు
అందుకోండి వినమ్రత మానవతాంజలి....!

రచన:- వేనాప
జి.ప.ఉ.పా.గుడిబండ
కోదాడ
98484 32533.

## చట్టం సాహితీ లోకం 95814 19999

### అహంకారపు దుర్వాసన



అన్నింటికంటే దుర్వాసనైన అహం
నీ శరీరమే భరిస్తోంది
అది అందరికీ తెలుస్తుంది
నీకు తప్ప

పొగరు అనే విషవల్లి
నిశ్శబ్దంగా నీలో పెరుగుతోంది
నిన్నే మింగివేసే శక్తి ఉందని
నీకు తెలియదు

మంచు కరిగినట్లు నెమ్మదిగా
వేడిలో నీరు ఆవిరైనట్లు మెల్లగా
నీ అంతరంగం ఖాళీ అవుతుంటే నీవు గమనించవు

అంతా బాగుంటే జేజేలు పలుకుతారు
గతి తప్పితే గోలగోల చేస్తారు
విర్రవీగే భజన గణం
వాతావరణం చూసే జనమే

భంగమై పోయిన బలం
చెదిరి పోయిన బలగం
చేతులెత్తిన ధనం
మదమొచ్చిన వేళ తాకవు

అవగాహన లేని పై పై మెరుపులు
తళుకు తళుకుల మాయలో
మనక మెలకువగా మెలగడమే మేలు అదే నిజమైన వెలుగు

రచన....సయ్యద్ హయ్యూల్ హయ్యూమ్
చురకశ్రీ కావలి నెల్లూరు జిల్లా.

## చట్టం సాహితీ లోకం 95814 19999

### ప్రకృతి కోయిల



లలిత గీతం - 3

పల్లవి:
మహిన ఏనుకోయుదులే
తుహిన బిందు విరులనే
ప్రకృతినే పూజింతు
అరుణోదయ వేళలో

1వ చరణం:
పాట పాడు కోయిల
తేట తెనుగు కందము
కొబ్బరాకు గలగలలు
విశ్వంభర ఊపిరులే

2వ చరణం:
ఝురులు గిరులు వాహినులు
తరులతలు పులుగులు
పులకించు గానములై
ధరణి జనని వీణియలో

3వ చరణం:
తనదు మది పయోధిలో
కలలుగాంచు కుసుమమే
తనదు జనమ కావ్యమే
ప్రకృతికే అంకితమ్

రచన:
మహేంద్రాడ సింహాచలాచార్య (టెక్కలి)
శ్రీకాకుళం జిల్లా

## చట్టం సాహితీ లోకం 95814 19999

### మాతృభాష..!




అమ్మలా లాలిస్తూ
నాన్నలా మార్గదర్శనం చేస్తూ
స్నేహితునీలా అండగా నిలుస్తూ
సామాజిక చైతన్యం రగిలించినది
నూతన అభ్యుదయం కలిగించినది
మాతృభాష.
మానసిక పరిజ్ఞానం పెరుగుటకు
మానవత్వం విరభూయుటకు
వినయం వికసించుటకు
ఆత్మజ్ఞానం అభివృద్ధి చెందుటకు
వెన్నుతట్టి నడుపుతూ
మార్గాన్ని సూచిస్తూ
భయాన్ని తొలగిస్తూ
అందరికి ఆత్మీయత పంచుతూ సాగే
విలువైన వజ్రపు ఘని
అమృత పలుకుల ఆమని
నూతన వసంత ధరణి
మాతృభాష.
వ్యక్తిత్వ వికాసానికి
భావ ప్రసారానికి
విజయ మార్గం
అనూహ్య గమ్యం మాతృభాష.

డా.యణమనగండ్ల రాజేందర్
వికాస వేదిక కార్యదర్శి
ఇల్లందు, భద్రాద్రి కొత్తగూడెం




## చట్టం సాహితీ లోకం 95814 19999

### నేను ఎవరు?



(తత్వ చింతన).
జటిలమైన ప్రశ్న!
దేహము,ఆత్మ!
రెంటిలో నేను ఎవరు?
నేటిది కాదు ఈ సమస్య!

అనాదిగా వేధిస్తున్నది!
పండితులు,పామరులు!
సన్యాసులు,సంసారులు!
ఉన్నవారు,లేనివారు!

మనుషులు అందరికీ!
తీరని సందేహం,జవాబు
దొరకని సందేహం!
నేను ఎవరు? ఎవరు నేను!
దేహమా? ఆత్మా?

పుట్టుక గతం ఏమిటి!
మరణం తర్వాత?
మధ్య మనిషి జీవితం!
బతుకు మిథ్య,ఒక భ్రాంతి!

ఒక్కటి సత్యం!
చూచేది మాయ!
మాయ మయ్యేది!
దేహం మాయం!

కనపడని ఆత్మ!
ఆశ్రయం దేహం!
ఆత్మ చైతన్యం!
మరణానికి అతీతం!

ఆత్మ లేని దేహం!
చైతన్య రహితం!
నేను అంటున్న దేహం!
అశాశ్వతం! లయం!

నీవు కాని ఆత్మ
స్థిరం,శాశ్వతం!
జనన మరణ రహితం!
సర్వ వ్యాప్తం,సజీవం!
ఆత్మ సాక్షాత్కారం దేహ
భ్రాంతి నివృత్తి!

ఇదే,భగవద్గీత సందేశం!
స్వస్తి!

రచన:
బాచిరాజు సత్యనారాయణ రావు,
(బా.స.రా)
విజయవాడ.

## చట్టం సాహితీ లోకం 95814 19999

### ఆత్మీయ అనురాగ బంధాలు




పుడమి పై పుట్టినది మొదలు పరమాత్మ దరిచేరు వరకు మానవజీవితం అనేక బంధాల కలయుక
జన్మనిచ్చిన జనకుల ఆత్మీయ అనురాగ బంధం
ఏకోదరులమై పుట్టిన సోదర సోదరీమణుల బంధం జీవితాన మరువలేనిది.
వేదమంత్రాల మధ్య
ఏడడుగులు నడచి జీవితాంతం కష్ట సుఖాలలో
కలిమి లేములలో, తొడునీడగా
ఒకరికి ఒకరై జీవించిన వివాహాబంధం అతిపవిత్రబంధం
జీవితాన కన్నవారితో
కట్టుకున్న వారితో చెప్పుకోలేని అనేక విషయాలను చెప్పుకునే స్నేహబంధం అత్యంత మధురం అందుకే'సృష్టిలో తీయనిది స్నేహమేనోయ్ అన్నది అక్షర సత్యం.
అజ్ఞానాన్ని తొలగించి యుక్తాయుక్తవిచక్షణను తెలియచేసి జీవితాన్ని ఆదర్శవంతమైనదిగా తీర్చిదిద్దే గురు శిష్య సంబంధం అత్యున్నత మైనది..!!

తల్లిదండ్రుల సేవచేసిన శ్రవణ కుమారుడు, ధర్మవ్యాధుడు
ఆదర్శదంపతులు సీతా రాములు , నాటి కృష్ణ కుచేల,నిన్నటి బాపు రమణల,శివాజీ మహరాజ్ రామదాసుల ,సాందీప కృష్ణబలరాముల బంధాలను అనుసరిస్తే ఆత్మీయ అనురాగ బంధాలు జీవిత సాఫల్యతకు మనుగడకు ఆధారాలు ......!!
................................

లోకా సమస్తా సుఖినో భవంతు
................................

కవిమిత్ర, సాహిత్య రత్న
ఆచార్య అయ్యలసోమయాజుల ప్రసాద్
(పుష్యమి)
విశాఖపట్నం

## యాదాద్రిలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

### మత్స్యావతార అలంకారంలో నారసింహుడు



**యాదగిరిగుట్ట,ఫిబ్రవరి20 :** మహిమాన్విత యాదగిరిగుట్టపై పంచ నారసింహుడిగా కొలువైన దేవ దేవుడి మత్స్యావతార అలంకార వైభవం భక్త జనులను అలరించింది. స్వామి వారి ప్రధానాలయం లక్ష్మీనరసింహ స్వామి వారి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజు శుక్రవారం నిత్యపూజ కైంకర్యాల అనంతరం మూలమంత్ర, మూర్తి మంత్ర హోమాలను వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారిని అభిషేకించి మత్స్యావతారుడిగా అలంకరించి ఆస్థానం చేశారు. నాలుగు వేదాలు, పురాణాలు, ఉపనిషత్తులు, దివ్యప్రబంధ ప్రాశుర పఠనాలను కనుల పండువగా చేపట్టారు.దుష్ట శిక్షణ..శిష్ట రక్షణ కోసం మహా విష్ణువు అవతార రూపాల్లో స్వామివారిని ఉత్సవాల్లో అలంకరించి సేవించడం ప్రత్యేకత అంటూ ప్రధానార్చకులు మత్స్యావతార విశిష్టతను వివరించారు. పట్టు వస్త్రాలు, బంగారు, వజ్రాభరణాలు, వివిధ రకాల పుష్పాలతో దివ్య మంగళకరంగా అలంకరించిన స్వామి వారిని కొలుస్తూ మంత్రోచ్చరణలు, మూలమంత్ర జప స్తోత్రాలు సాగుతుండగా గోవిందనామ స్మరణ మార్మోగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో భవాని శంకర్, అనువంశిక ధర్మకర్త బీ. నరసింహ మూర్తి, డీఈవో భాస్కర్ శర్మ, ప్రధాన అర్చకులు కాండూరి వెంకటాచార్యులు, భట్టర్ సురేంద్రాచార్యులు పాల్గొన్నారు.

